సమావేశము - II
వాల్యూం - I
నెం. 4

వెల : రూ. 4-50
13 ఫిబ్రవరి, 2024
మంగళవారం

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

పేజి. నెం.

1. 2024-2025 సంవత్సరానికి గాను వార్షిక ఆదాయ-వ్యయ పట్టిక (బడ్జెట్) (ఓట్ ఆన్ అకౌంట్) (కొనసాగింపు) ... 01

2. 2023-2024 సంవత్సరానికి గాను వ్యయపు అనుబంధ అంచనాలు (కొనసాగింపు) ... 01

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ ఎస్. దుర్గాప్రసాద్
		శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి
ఉప కార్యదర్శులు	:	శ్రీమతి వి.ఎస్. ప్రసన్న కుమారి
		శ్రీ ఇ. సంజీవరావు
సహాయ కార్యదర్శులు	:	శ్రీమతి బి. ప్రమీల
		శ్రీమతి ఎస్. నాగమణి
		శ్రీ డి. శ్రీనివాసులు
		శ్రీ ఎమ్. రఘుమారెడ్డి
		శ్రీ ఎ. సుధాకర్
		శ్రీ పి. శ్రీనివాస్
		శ్రీమతి ఎ. పద్మాసిని
		శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ
		శ్రీ ఎన్. సుజిత్ కుమార్
		శ్రీ కె. భాస్కర శ్రీనివాస్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వర రెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(3వ శాసన సభ)

(రెండవ సమావేశపు నాలుగవ రోజు)

మంగళవారము, ఫిబ్రవరి 13, 2024

(సభ ఉదయం 10.00 గంటలకు ప్రారంభమైనది)

MR. SPEAKER:-

I. <u>ANNUAL FINANCIAL STATEMENT (BUDGET) (VOTE-ON-ACCOUNT) FOR 2024-2025:</u>

I request the Deputy Chief Minister to move the Motion on the Annual Financial Statement (Budget) (Vote-on-Account) for the year 2024-25.

SRI BHATTI VIKRAMARKA MALLU, Deputy Chief Minister (Finance & Planning, Energy):- Speaker Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.78911,23,79,000/- for meeting the essential expenditure for the first four months in the year 2024-25 as per the Heads of Demands shown in the Notice Dated: 10th February, 2024."

MR. SPEAKER:- Motion moved.

II. <u>SUPPLEMENTARY ESTIMATES OF EXPENDITURE FOR 2023-2024</u>.

I request the Deputy Chief Minister to move the Supplementary estimates of expenditure for the year 2023-24.

SRI BHATTI VIKRAMARKA MALLU, Deputy Chief Minister (Finance & Planning, Energy):- Speaker Sir, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.46400,40,09,000/- for further expenditure during the year 2023-24 as per the Heads of Demands shown in the Notice Dated: 12th February, 2024."

MR. SPEAKER:- Motion moved. L.A. Minister, Sri D. Sridhar Babu....

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అధ్యక్షా, మొన్న మీ అనుమతితో గౌరవ ముఖ్యమంత్రిగారు, అదే విధంగా గౌరవ ఇరిగేషన్ శాఖ మంత్రిగారు ఈరోజు గౌరవ శాసన సభ్యులని, శాసన పరిషత్తు సభ్యులను అందరిని కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజి సందర్శించడానికి రావాలని ఈ సభాముఖంగా వారు కోరడం జరిగింది. ఈరోజు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. నేను గౌరవ సభ్యులందరినీ కోరుతున్నాను తప్పకుండా మీరందరూ రావాలని. మీరు మొన్న చూశారు. బ్యారేజీ నిర్మాణం, ఆ నిర్మాణంలో ఉన్న లోపాలు, ఆ లోపాలకు సంబంధించిన అనేక అంశాల గురించి మా ప్రభుత్వం రాగానే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారు, అదే విధంగా ఇరిగేషన్ మంత్రిగారు పూర్తి స్థాయిలో సమీక్షించారు. గతనెల ఇరిగేషన్ మంత్రి శ్రీ ఉత్తమ్‌కుమార్ రెడ్డిగారు, మేము మరియు ఇతర సహచర మంత్రివర్గ సోదరులందరం కూడా, ఆనాడు ఆ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులతో కలిసి వెళ్లి, వాస్తవ విషయాలు చర్చించి, నివేదికలు తీసుకువచ్చాము. మేడిగడ్డకు

సంబంధించి కుంగిపోయిన బ్యారేజి, శిథిలావస్థకి చేరిన బ్యారేజి, పగుళ్లు వచ్చిన బ్యారేజి, వీటన్నిటికి గల అసలు కారణాలు ఏమిటని, ఈ వ్యవహారం మొత్తం విజిలెన్సుకి అప్పగించాలని నిర్ణయించి, వెంటనే దర్యాప్తుకి విజిలెన్సుకి ఇవ్వడం జరిగింది.

10.10 ఉ. విజిలెన్స్ రిపోర్టు వచ్చింది. ఆ రిపోర్టు ఇచ్చిన నేపథ్యంలో ఆ రిపోర్టుకు సంబంధించిన అనేక అంశాలపై ప్రత్యక్షంగా ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారి ఆధ్వర్యంలో, ఉపముఖ్యమంత్రిగారు, అదేవిధంగా గౌరవ సహచర మంత్రివర్గ సభ్యులు, గౌరవ శాసనసభ్యులందరం, అన్ని పార్టీలకు సంబంధించి సిపిఐ, ఎమ్ఐఎమ్,బిజేపి, టిఆర్ఎస్ పార్టీ సభ్యులందరిని తీసుకెళ్లాలని, నేడు మేము ఒక్కరమే మాట్లాడితే అదేదో రాజకీయపూరితంగా ఉంటుందని కొంత మంది మాట్లాడుతున్న సందర్భంలో నేడు వారే వచ్చి వాస్తవిక పరిస్థితులను, వాస్తవిక దృష్యాలను ప్రజల ముందు ఉంచాలనే ఒక ఆలోచనతో ఈరోజు అందరినీ ఆహ్వానిస్తున్నాము. దానికితోడు ఎన్నికల సందర్భంలో డ్యామ్ సేఫ్టీ అధికారులు మా ప్రభుత్వ అధికారులు కాదు, డ్యామ్ సేఫ్టీకి సంబంధించిన కేంద్రప్రభుత్వ అధికారులు మొదటి నుంచి కూడా ప్రాజెక్ట్ డిజైనింగ్‌లో, ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్‌లో, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్‌లో అన్నింటిలో తప్పిదాలు ఉన్నాయని వారిచ్చిన అభిప్రాయాన్ని ఈ సభాముఖంగా ఈరోజు తెలియజేస్తున్నాము. పత్రికలల్లో కూడా వచ్చింది. డ్యామ్ సేఫ్టీకి సంబంధించి ఆ డ్యామ్ సేఫ్టీ అధికారులు డ్యామ్ పగుళ్లకి, కుంగిపోవడానికి ఎప్పుడు లేని విధంగా .. యావత్ భారతదేశంలో ఎన్ని బ్యారేజీలు నిర్మాణం చేసినా ప్రత్యేకించి మా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో పెద్ద, పెద్ద బ్యారేజీలు, డ్యామ్‌లు కట్టి సుమారు 50సంవత్సరాలు గడిచినప్పటికి ఒక్క డ్యామ్‌పరంగా కూడా చిన్న పగుళ్లు కానీ, కుంగిపోవడం కానీ ఎప్పుడూ జరగలేదు. నేడు ఈ విధంగా జరిగిందంటే రాష్ట్రప్రజలకు సంబంధించిన సంపద ఏ విధంగా వృధా కావడం జరిగింది, ఆనాడున్న ప్రభుత్వం తీసుకున్న ఆనాలోచితమైన నిర్ణయాల వల్ల ఇష్టారాజ్యంగా అడ్డగోలుగా నిర్మాణం జరిగింది కనుక పూర్తి స్థాయిలో అవినీతి జరిగిందని, ఆ అవినీతి వలన రాష్ట్రప్రజలకు సంబంధించిన ఖజానాకు సంబంధించిన డబ్బు ఏ విధంగా దుర్వినియోగ మయిందో విజిలెన్స్ రిపోర్టు ఇచ్చిన వాస్తవాన్ని వారి దృష్టికి తీసుకెళుతున్నాము.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మేము చెప్పింది కాదు, మా ప్రభుత్వం చెబితే ఒక రీతిగా ఉంటుంది. మేము ఏమి చెప్పలేదు. ఒక పరంగా డ్యామ్ సేఫ్టీ అధికారులు, ఇంకోపరంగా అధికారుల పరంగానే విజిలెన్స్ రిపోర్టుకు సంబంధించి తీసుకున్న నిర్ణయం ప్రకారం.....

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

అధ్యక్షా, వాళ్లనే వాస్తవాలను చూడటానికి రమ్మంటున్నాము. వాస్తవాలను స్వయానా వారి కండ్లతో చూడాలని వారిని కోరుతున్నాము. మేము వారిని కూడా కోరేది ఒకటే.. నా నియోజకవర్గానికి సంబంధించిన మూడు బ్యారేజీలు కట్టారు.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యులు శ్రీ టి.హరీష్‌రావు, శ్రీ కడియం శ్రీహరిగారి నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- హరీష్‌రావుగారూ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగా మీకు అనుభవం ఉన్నది. మీరు ఈ సభలో సీనియర్ సభ్యులు, నిన్న నలభైనిమిషాల సమయం మాట్లాడాల్సి ఉన్నప్పటికీ గంటన్నర పాటు మీరు మాట్లాడారు. మీరు కూడా రాజకీయ ప్రసంగాలు ఇచ్చారు. మీరు ఈ విధంగా అడ్డుకోవడం సమంజసం కాదు. సభ మర్యాదలను కాపాడండి. శ్రీహరిగారూ మీరు కూడా సభ మర్యాదలను కాపాడండి.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యులు శ్రీ టి.హరీష్‌రావు, శ్రీ కడియం శ్రీహరి, శ్రీ వేముల ప్రశాంత్‌రెడ్డిగార్ల నుంచి అంతరాయం)

శ్రీ డి.శ్రీధర్ బాబు:- అధ్యక్షా, మేము వారిని అనడం లేదు. అధికారులు ఇచ్చిన రిపోర్టు సభ ముందు పెడుతున్నాము. ఎందుకు వాళ్లు అలా ఉలిక్కిపడుతున్నారు? సభాపతిగారి అనుమతితో మాట్లాడడం జరుగుతున్నది. గౌరవనీయులు హరీష్‌రావుగారికి, ప్రశాంత్‌రెడ్డి గారికి,

శ్రీహరి గారికి సభాపతికి సంబంధించిన సర్వ అధికారాల గురించి తెలుసు. సభాపతి గారికి ఎటువంటి అధికారాలు ఉంటాయి, సభాపరంగా ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటారు...

(బిఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

ఈరోజు ఎందుకు వెళుతున్నామో చెప్పాల్సిన అవసరం ఉంటుంది కదా. మిమ్మల్ని వేము ఎందుకు రమ్మంటున్నామో అది కూడా చెప్పాల్సి ఉంటుంది కదా. ప్రత్యేకంగా మా ప్రాంతానికి సంబంధించి మూడు బ్యారేజీలు నిర్మాణం జరిగాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం జరుగుతున్నప్పుడు ఆ ప్రాంత ప్రజలు, ఆ రైతు సోదరులకి సంబంధించిన భూములు కోల్పోయి, ఇండ్లు కోల్పోయి పూర్తి స్థాయిలో నష్టం జరిగి రాష్ట్ర ప్రయోజనాల గురించి వారు త్యాగం చేసినా ఆ త్యాగానికి ఫలితం లేకుండా పోయిందని నా ప్రాంత రైతుల ఆవేదన చెందుతున్నారు. ఆ ఆవేదనతోపాటు ఆ ప్రాంత రైతులకు సంబంధించిన అంశాలను, రాష్ట్రప్రజలకు సంబంధించిన సంపద ఏ విధంగా వృధా అయిందో మీరందరూ చూడటానికి రమ్మని కోరుతున్నాము.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, మన పెద్దలు సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు అని చెప్పారు. ఎందుకంటే ప్రజలకు, సామాన్యులకు, పేదలకు ముఖ్యంగా రైతాంగానికి.. దేవాలయం ఎంత పవిత్రమైనదో, మనం ఏదైనా ఆపదలో ఉంటే దేవుడిని కోరుకుంటే ఆ ఆపద నుంచి గట్టెక్కిస్తాడనే ఉద్దేశంతో కష్టాలల్లో, కన్నీలల్లో, ఆకలితో ఆత్మహత్యలతో అల్లాడుతున్న రైతాంగం కోసం సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి,ఎడారిగా బీటలు వారిన పొలాలను, పచ్చని పైరులతో పండించాలన్న ఉద్దేశంతో సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని పెద్దలు చెప్పారు. అదే విధంగా తెలంగాణ ప్రజలు ఈ ప్రాంత వలసలు, ఈ ప్రాంతంలో ఉన్న పరిస్థితులను పాలకుల యొక్క నిర్లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని నీళ్ల కోసం నిప్పులు చెరిగే విధంగా తెలంగాణ సమాజమంతా కొట్లాడారు.

శ్రీ టి.హరీష్ రావు (మైకు లేకుండా):- ఎజెండాలో పొందుపర్చిన అంశాల గురించి చర్చించమనండి.

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి:- అధ్యక్షా, వారు గతంలో శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రిగా పనిచేశారు. ఏదైన ప్రత్యేక అంశమున్నప్పుడు ఎజెండాలో లేకపోయినా సభాపతిగారికి సర్వ అధికారాలు ఉంటాయి. ప్రత్యేకమైన సందర్భంలో ప్రత్యేకమైన అంశాల మీద సభాపతిగారు అనుమితిస్తే ఏ సభ్యుడైనా మాట్లాడవచ్చు. ఒకవేళ ఆ సభ్యులు మాట్లాడదల్చుకుంటే సభాపతిగారు అనుమతిస్తే మిగతా సభ్యులకు ఎవరికి కూడా అభ్యంతరం లేదు. కాబట్టి దయచేసి సభాసాంప్రదాయలను గౌరవించమనండి. తెలంగాణకు ప్రధానంగా రెండు సాగునీటి, తాగునీటికి వనరులున్నాయి. ఒకటి కృష్ణానది జలాలు, రెండు గోదావరి నది జలాలు. కృష్ణా జలాల మీద దాదాపుగా నిన్న తమరి అనుమతితో కొంత మేరకు మనం చర్చించగలిగాము. వాస్తవాలను ఈ రాష్ట్ర ప్రజలకు మనం చెప్పగలిగాము. ఇకరెండవది గోదావరి జలాలు. గోదావరి జలాల మీద మీకు తెలుసు, ఆనాడు తమరు మంత్రిగా ఉన్నప్పుడే డాక్టర్ వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, ఆనాడు పెద్దలు దేవేందర్‌గౌడ్‌గారు ఆదిలాబాద్ నుంచి చేవెళ్ల వరకు పాదయాత్ర చేసి తెలంగాణ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలంటే ప్రాణహిత చేవేళ్ల నిర్మించాలని చెప్పి వారు పాదయాత్ర చేపట్టడం జరిగింది. ఆనాటి ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజల ఆలోచనను దృష్టిలో పెట్టుకొని ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టును ఆరోజు ప్రారంభించడం జరిగింది. ఆరోజు దాదాపుగా మొదట పన్నెండు లక్షల ఎకరాలు అనుకొని తర్వాత పద్నాలుగు లక్షల పైచిలుకు ఎకరాలతో రూ.38,500కోట్లతో 2008వ సంవత్సరంలో టెండర్ పిలవడం జరిగింది.

10.20 ఉ. పనులు కూడా ప్రారంభమైనాయి. ఆరోజు పెద్దలు వెంకటస్వామి గారు విజ్ఞప్తి చేస్తే, వారి సూచనతో ప్రాణహిత-చేవెళ్లకు డా. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి పేరు జోడించి ఆ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చే వరకు ప్రాణహిత-చేవెళ్ల పనులు ప్రారంభించినప్పుడు చేవెళ్లలో వేల కోట్ల రూపాయల పనులు

జరిగాయని మీకు తెలుసు. తెలంగాణ రాష్ట్రం వచ్చి ప్రభుత్వం మారిన తరువాత కొంత కాలానికి అధికారంలో ఉన్న వాళ్లు రీడిజైనింగ్ అనే ఒక బ్రహ్మ పదార్థాన్ని కనిపెట్టారు. ఆ బ్రహ్మ పదార్థంతో తుమ్మిడిహట్టి దగ్గర నిర్మించాల్సిన ప్రాజెక్టును వివిధ మార్పులు చేర్పులకు దారితీసి చివరికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల దగ్గర బ్యారేజీలు కట్టి మేడిగడ్డ నుంచి నీళ్లు లిఫ్ట్ చేసి అన్నారంలో పోస్తాం, అన్నారంలో నుంచి నీళ్లు లిఫ్ట్ చేసి సుందిళ్లలో పోస్తాం, సుందిళ్లలో నుంచి నీళ్లు లిఫ్ట్ చేసి మిడ్‌మానేరులో పోస్తాం అక్కడి నుంచి మిగతా ప్రాంతాలకు నీటిని తరలిస్తామని రీడిజైనింగ్ అనే ఒక బ్రహ్మ పదార్థాన్ని కనిపెట్టి రూ.38,500 కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ పనులను రూ.1,47,000కోట్లకు పెంచారు. పూర్తి డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఉందా అంటే అది కూడా లేదు. ఇప్పటికీ ప్రాజెక్టు వ్యయం రూ.1,47,000కోట్లకు చేరింది. అది ఇంకా భవిష్యత్తులో పూర్తి చేయాలంటే రెండున్నర లక్షల కోట్లు అవుతుందా, ఎంత అవుతుందని ఇంతవరకు అంచనాలు వేయడానికి సాహసం చేసే పరిస్థితి లేదు.

సరే, అంచనాలు ఎట్లా పెంచారు? ప్రాజెక్టు రీడిజైనింగ్ ఎట్లా చేశారు? సాంకేతికపరమైన అంశాలేంది? సాంకేతిక నిపుణులు ఇచ్చిన ప్రాజెక్టు డిజైన్ ఏంది? దాని తరువాత జరిగిన నిర్మాణమేంది? నిర్మాణం తరువాత జరిగిన నిర్వహణేంది? ఇవన్నీ ఒక ఎత్తయితే ఈరోజు మేడిగడ్డ బ్యారేజి అనేది కుంగి పోయింది అధ్యక్షా. కుంగిపోయినప్పుడు గతంలో ఉన్న ప్రభుత్వం ఏం చెప్పింది, బ్యారేజి కింద ఇసుక కదలడం వల్ల ప్రాజెక్టు కుంగిందని చెప్పారు. నేను తమరి ద్వారా అడుగుతున్నాను, ఇసుకలో పేకమేడలు కట్టారా? ఇసుక కదిలేటట్లు ప్రాజెక్టు బ్యారేజీలు కట్టి, వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. ఈరోజు అది కూలిపోతే చుట్టూరా పోలీసు పహారా. వాఘా బార్డర్‌లో కూడా అంత పోలీసు పహారాలు లేవు. భారత్ – పాకిస్తాన్ సరిహద్దుల్లో వాఘా బార్డర్ ఉంటుంది. అంటే పాకిస్తాన్‌లోకి వెళ్లాలంటే శత్రు దుర్భేద్యంగా ఉండే విధంగా అక్కడ ఉండే పోలీసులు, ఆర్మీ పహారా కాస్తుంటారు. అంతకంటే ఈ మేడిగడ్డ ప్రాంతంలో కుంగిన బ్యారేజీని ఎవరినీ చూడనివ్వకుండా, పిట్ట కూడా ఎగరడానికి వీలులేకుండా ఆనాటి ప్రభుత్వం దాచిపెట్టింది. దానితో ఈ బ్యారేజీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో National Dam Safety Authority అధికారులను పంపించి ప్రాథమికంగా ఆ ప్రాజెక్టు ఏమి జరిగిందో చూసి ఒక నివేదిక ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంలోని ఆ సాంకేతిక నిపుణులు ఇచ్చిన నివేదికను కూడా గత ప్రభుత్వం తప్పు పట్టింది.

ఈనాడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత అక్కడ జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో కొంతమంది అధికారులు ఆఫీసుల నుంచి ఫైల్స్ మాయం చేశారని టీవీలు, పేపర్లలో పెద్ద ఎత్తున వార్తలొచ్చాయి. తక్షణమే ప్రభుత్వం తేరుకొని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను పిలిచి అందులోని ఫైల్స్ ఎలా మాయమైనాయి, ఎవరు మాయం చేశారు, అదేవిధంగా మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులలో జరిగిన అవకతవకల మీద మీరు ఒక నివేదిక తయారు చేయండని చెప్పి ప్రభుత్వం ఆదేశాలివ్వడం జరిగింది. సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గారి సూచన మేరకు ఈ ఆదేశాలిచ్చాం. వాళ్లు పూర్తి స్థాయిలో వీటన్నింటినీ పరిశీలించి ప్రాథమికంగా ఒక నివేదిక ఇచ్చారు. అందులో తీసుకున్న నిర్ణయాలు గాని, లోపభూయిష్టమైన నిర్మాణాలు గాని, నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యానికి సంబంధించిన చాలా విషయాల గురించి వారు నివేదికలో ఇచ్చారు. ఆ నివేదిక నేపథ్యంలో చాలా మంది సభ్యులకు గాని, రాష్ట్రప్రజలకు గాని అక్కడ ఏమి జరిగిందో, ఏమైందో ఇప్పటివరకు సంపూర్ణమైన సమాచారం లేదు.

ఈరోజు కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులు సగానికి పైగా ఉన్నారు. కొంతమంది సీనియర్లు ఉన్నా ఈ ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ పట్ల ఏ మేరకు పట్టు ఉందో తెలియదు. అందుకే ఒక మంచి ఆలోచన చేసి, ఉప ముఖ్యమంత్రి గారు మరియు మంథని శాసన సభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఈరోజు ఐ.టి. అండ్ ఇండస్ట్రీస్/లెజిస్లేటివ్ అఫైర్స్ మినిస్టర్‌గా ఉన్న శ్రీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గారు అక్కడ

ఏం జరిగిందో తెలుసుకోవలసిన బాధ్యత శాసన మండలి సభ్యుల మీద ఉన్నది కాబట్టి మీరందరు అక్కడికి రండీ, వచ్చి చూడమని చెప్పారు. ఇచ్చిన నివేదికల మీద రేపు ఈ సభలో జరగబోయే చర్చలను కళ్లారా చూడాలని చెప్పి వారు సూచన చేశారు. నిన్న, మొన్న ఇదే సభలో మంత్రిగారు కూడా అధికారికంగా లేఖలు రాశారు. ఈరోజు ఉదయం 10 గంటలకు సభా సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని, దీనిమీద ఆహ్వానం పలికి ఆ తరువాత మనం అక్కడికి బయలుదేరుదామని ఇంక్లూడింగ్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి, అదేవిధంగా భారతీయ జనతా పార్టీకి, ఎంఐఎంకు, సిపిఐ సభా పక్షాలందరికీ కూడా ఉత్తమ్‌కుమార్ రెడ్డి గారు లేఖ రాసి పంపడం జరిగింది. ఈ నేపథ్యంలో ఈరోజు మనందరం మంథనికి వెళ్లి మేడిగడ్డ బ్యారేజీని కళ్లారా చూసి, వాటి వివరాలన్నింటినీ తెలుసుకొని, విజిలెన్స్ ఇచ్చే నివేదికలను అక్కడ శాసన మండలి సభ్యులకు వివరించిన తరువాత మంత్రులతో సహా అది చూసి వచ్చి, రేపో, ఎల్లుండో తమరి అనుమతితో సాగునీటి పారుదల శాఖమంత్రి గారు శ్వేతపత్రాన్ని సభలో పెట్టబోతున్నారు, చర్చకు తీసుకురాబోతున్నారు. ఆరోజు సభ్యులందరూ కూడా ఈ వాస్తవాలను చూసి, ఈ వాస్తవాల నేపథ్యంలో అవగాహనతో కూడుకున్న చర్చ జరిగే విధంగా తెలంగాణ సమాజానికి, తెలంగాణ రైతాంగానికి మేలు జరగాలి, మేలు చేయాలనే ఒక సదుద్దేశంతో ఈరోజు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నాము.

నేను ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్‌కు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి నా విజ్ఞప్తి. మీరు, మీ శాసనసభ్యులు.. ఎందుకుంటే ఈ అద్భుతం, ఈ man-made wonder ప్రపంచంలోనే అద్భుతమని ఇక్కడ కాదు న్యూయార్క్‌లో ఉండే టైమ్స్‌స్క్వేర్ కూడలిలో, పెద్ద పెద్ద డిస్కవరీ ఛానల్స్‌తోపాటు ప్రపంచంలో అద్భుతాలను ప్రదర్శించే దగ్గర కూడా దీన్ని ప్రదర్శించారు. సంతోషం. తమరు(శ్రీ కె.చంద్రశేఖర్ రావు) ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, తమరి ఆలోచనతో, అనుభవంతో, తమరి ఆదేశాలతో ఈ అద్భుతాన్ని ఆవిష్కరించారు కదా మరి ఈరోజు ఈ అద్భుతాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న శాసన మండలి సభ్యులకు చూపించేటప్పుడు, వారే ముందుండి, ఈ అద్భుతాన్ని ఏ విధంగా సృష్టించారో, దానికోసం వారు ఎంత శ్రమ పడ్డారో, ఎన్ని నిద్రలేని రాత్రులు వారు గడిపారో ఆ అనుభవాలన్నింటినీ కూడా అక్కడ అందరికీ వివరించి చెబితే బాగుంటుంది. తెలంగాణ సమాజానికి తాజ్‌మహలంత అద్భుతంగా అక్కడ ఆవిష్కరించారు కాబట్టి కళ్లారా మేము చూసి, మా చెవులకు వీనువిందుగా వారు చెప్పడానికి అవకాశముంటుంది. తమరి ద్వారా మరొక్కసారి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి, గత సాగు నీటిపారుదల శాఖ మంత్రి తరువాత ఆర్థిక శాఖ మంత్రి అయిన మిత్రులు హరీష్‌రావు గారికి, పెద్దలు కడియం శ్రీహరి గారు కూడా గతంలో సాగునీటిపారుదల శాఖమంత్రిగా పని చేశారు, అనుభవజ్ఞులు, తెలంగాణ సమాజంలో వారిపట్ల గౌరవమున్నది, వారు అక్కడికి వచ్చి, నిష్పక్షపాతంగా విశ్లేషించి తెలంగాణ సమాజానికి అక్కడ ఉన్న పరిస్థితులు గురించి చెబితే బాగుంటుంది. కాళేశ్వరం మీకు ATM గా మారింది, మీ ఇంట్లో కనకవర్షం కురిసిందని మేము ఇక్కడ అనదలచుకోలేదు. కాకపోతే అక్కడ ఏదైతే జరిగిందో, ఆ జరిగిన వాస్తవాలను తెలంగాణ ప్రజలకు తెలుసుకునే హక్కు, అధికారం లేదా అని నేను అడుగుతున్నాను. ఈరోజు మేమందరం గత నాలుగైదు రోజుల నుంచి చెబుతూనే ఉన్నాం. మనందరం కలిసి వెళదామయ్యా, ఒక మంచి వాతావరణంలో కలిసిమెలసి, అక్కడికి వెళ్లి చూసి తప్పు జరిగిందా, లేదా, తప్పు జరిగితే తప్పు జరిగిందని నిర్ధారిస్తే, ఆ తప్పుకు కారణమెవరూ, దానికి విధించాల్సిన శిక్ష ఏంది అని ఈ సభలో చర్చించుకొని, ఈ సభ ద్వారా ఒక మంచి సాంప్రదాయానికి తెరతీద్దామనేదే మా ఆలోచన.

10.30 ఉ. ఈ రోజు మేము దాని కోసమే ఆ ప్రాంత శాసనసభ్యుడు కాబట్టి ... గతంలో గవర్నరు గారు ఉండేవారు, వారి పేరు ఎందుకు కానీ, వారు ఏమన్నారంటే హరీష్‌రావు బదులు కాళేశ్వర్‌రావు అని అన్నారు. కాళేశ్వర్‌రావుగారిని కూడా మేము కాళేశ్వరం పోదాము రమ్మని అడుగుతున్నాము. మేము ఆహ్వానించడంలో తప్పేముంది అధ్యక్షా. ఎందుకంటే అందరం కలిసి పోయినట్టుగా ఉంటుందని మేము రోడ్డు మార్గంలో బస్సులు ఏర్పాటు

చేసుకున్నాము. ఒక వేళ మీకు బస్సులో అంత దూరం ప్రయాణం చేయడానికి ఏదైనా ఇబ్బంది ఉంటే ప్రభుత్వానికి అధికారికంగా హెలికాప్టర్ ఉన్నది. పెద్దలు చంద్రశేఖర్‌రావుగారి కోసం ప్రత్యేకంగా హెలికాప్టర్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం బేగంపేట్ హెయిర్‌పోర్టులో సిద్ధంగా ఉంచింది. కాబట్టి దయచేసి దీన్ని వివాదాలకు తావు ఇవ్వకుండా మనందరం ఒక్క మాట మీద ఉండి కూలిపోయిన మేడిగడ్డ గురించి, పేలిపోయిన..

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

ప్రశాంత్‌రెడ్డిగారు గతంలో ఆర్ అండ్ బి మంత్రిగా పనిచేశారు. వారు ఈ విధంగా మాట్లాడడం ఏమిటి? వీళ్లే బాంబులు పెట్టి పేల్చారని పోలీసుస్టేషన్‌లో కంప్లైంట్ పెట్టారు. బాంబులు పెట్టి పేలిస్తే సింపుల్ లాజిక్ ..... ఏదైనా బాంబులు పెట్టి పేలిస్తే శకలాలు గాలిలోకి ఎగురుతాయి భూమిలోకి పోవు. ఇది, అ, ఆ లు రాసే అబ్బాయికైనా అర్థమవుతుంది. బాంబులు పెట్టి పేలిస్తే గాలిలోకి ఎగురుతుంది, భూమిలోకి కుంగదు. పోలీసు స్టేషన్‌లో ఆ విధంగా కంప్లైంట్ పెట్టారు కాబట్టి ఇది బాంబులు పెట్టి పేల్చారా? లేకపోతే కింద ఇసుక మీద పిట్టగూడు కడితే, పేకమేడలు కడితే కుంగిందా? ఇవన్నీ సమాజం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. సభ్యులుగా చర్చించే ముందు మనమందరం కూడా అక్కడకు వెళదాము. కాబట్టి దయచేసి సభాపక్షనాయకుడుగా ప్రధాన ప్రతిపక్షనాయకుడు శ్రీ చంద్రశేఖర్‌రావుగారిని, అదేవిధంగా మాజీ సాగునీటి పారుదల/ఆర్థికశాఖమంత్రి గారిని.. ఎందుకంటే అన్ని నిధులు వారే ఇచ్చారు కాబట్టి హరీష్‌రావుగారిని కాళేశ్వరం రావాలని కోరుతున్నాను. పెద్దలు కడియం శ్రీహరి గారికి ఈ తెలంగాణ సమాజం పట్ల ఈ సమస్యల పట్ల, సాగునీటి ప్రాజెక్టుల పట్ల ఒక అవగాహన ఉన్నది. వారి లాంటి వాళ్లు చూసి విశ్లేషించి చెబితే మేము కూడా కొంత నేర్చుకుంటాము. ఎందుకంటే అన్నీ మాకు తెలుసు అని మేము అనుకోము. మేము అపర మేధావులము కాదు, ఎందులోనైనా మాకు తెలియంది ఉంటే అడిగి తెలుసుకుంటాము. శ్రీహరిగారు, తుమ్మల నాగేశ్వరరావుగారి లాంటివాళ్లు అనుభవజ్ఞులు, గతంలో ఈ శాఖలల్లో మంత్రులుగా బాధ్యతలు నిర్వహించిన వాళ్లు ఉన్నారు. కొత్త తరం నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వ శాఖలు ఎప్పుడు నేను నిర్వహించలేదు కాబట్టి నేను కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. నేర్చుకోవడానికి నేను సిద్ధంగా ఉన్నా కాబట్టి దయచేసి ఇక్కడ నుంచి మనమందరం బయలుదేరి అక్కడ చూసి అక్కడున్న పరిస్థితులన్నింటిని అవగాహన చేసుకొని రేపో, ఎల్లుండో తమరి అనుమతి తీసుకుని మంత్రిగారు శ్వేతపత్రం ప్రవేశపెడతారు. శ్వేతపత్రంలో తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులన్నింటి మీద చర్చ చేద్దాము. అదే విధంగా కాళేశ్వరం, కాళేశ్వర రావుగారి మీద చర్చ చేద్దాము. ఇది ఎవరెవరికి ఏటిఎమ్‌గా మారింది, దీని సంగతేంది, దీని కథేంది, దీని కమామిసు ఏంది ఈ సభలో చర్చించుకుందామని తెలియజేస్తూ తమరు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రత్యేకంగా సభ్యులందరూ రావాల్సిందిగా కోరుతున్నాను. రేపో, ఎల్లుండో దీని మీద చర్చ చేయడానికి మీరు అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

(బీఆర్ఎస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR.SPEAKER:- The House is adjourned to meet again at 10.00 A.M. tomorrow the 14th February, 2024.

(The House then adjourned at 10.32 A.M., to meet again at 10.00 A.M., on 14th February, 2024.)

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."